ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 18 అక్టోబరు 2025 | 7



చూసిన కనులదే భాగ్యమట!

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



ఎలా.. జరిగింది!

రాయవరంలో బాణసంచా పేలుడుపై దర్యాప్తు ఆరంభం.. విచారణ జరిపిన ద్విసభ్య బృందం

ఈనెల 8న రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది.. ఆ ప్రమాదంలో మొత్తం 10 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పేలుడు జరిగిన ప్రాంతంలో శుక్రవారం ప్రమాదంపై విచారణ చేపట్టారు. 9



ద్విసభ్య బృందం సభ్యులు ఎస్.సురేష్‌కుమార్, ఆర్కే రవికృష్ణలకు ఘటనా వివరాలు వివరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

చూసిన కనులదే భాగ్యమట.. అవును మరి.. ఆ స్వామిని దగ్గర చూసి భక్తజనం పరవశించిపోతున్నారు.. కన్నులారా తిలకించేందుకు భక్తజనం పోటీపడుతున్నారు.. ఎక్కడెక్కడి నుంచో తరలివచ్చి స్వామిని వేడుకుంటున్నారు.. వాడపల్లి వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు కనులపండువగా సాగాయి. కల్కి అలంకరణలో శ్రీవారు అశ్వ వాహనంపై భక్తుల గోవిందనామస్మరణ నడుమ మాడవీధుల్లో విహరించారు. 9



విలేజ్‌లకు టౌన్ లుక్!

- పంచాయతీల్లో పట్టణ తరహా సేవలకు శ్రీకారం
- జిల్లాలో 18 రూర్బన్ పంచాయతీల గుర్తింపు
- ప్రత్యేక సిబ్బంది నియామకం.. మౌలిక వసతులపై దృష్టి





కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీరాజ్‌శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టింది. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను చేపట్టి అందరి మన్ననలు పొందింది. ఇదిలా ఉండగా పంచాయతీల్లో పట్టణ తరహా సేవలు ప్రజలకు అందించేందుకు కొత్త విధానానికి రూపకల్పన చేసి కేబినెట్ ఆమోద ముద్ర పొందింది. తద్వారా మరింత మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. క్లస్టర్ వ్యవస్థను రద్దుచేసి గ్రామ పంచాయతీలను స్వతంత్ర ప్రతిపత్తి గల స్థానిక సంస్థలుగా మార్చేందుకు నిర్ణయించింది. దీనిలో భాగంగా పంచాయతీల్లోను, పట్టణ తరహా సేవలు అందించనున్నట్టు ప్రకటించింది. అత్యధిక ఆదాయం, అత్యధిక జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను ఇకపై రూర్బన్ పంచాయతీలుగా మారనున్నాయి. ప్రాథమిక సమాచారం మేరకు జిల్లాలో 18 రూర్బన్ పంచాయతీలను గుర్తించారు.

అమలాపురంరూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పంచాయతీలు, నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలు.. ఇలా జనాభా ప్రాతిపదికన వర్గీకరణ ఉంటుంది. ఇప్పుడు మరో కొత్త వర్గీకరణ ద్వారా పెద్ద పంచాయతీలను ప్రత్యేక కేటగిరీ కింద అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా పది వేలమందికిపైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను 'రూర్బన్' పంచాయతీలుగా గుర్తించారు. అదేవిధంగా రూ.కోటికి పైగా ఆదాయం కలిగిన పంచాయతీలు కూడా ఇదే కేటగిరి కిందకు వస్తాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తీసుకున్న నిర్ణయం మేరకు రూర్బన్ పంచాయతీల్లో పట్టణ తరహా సేవలు అందించనున్నారు. పురపాలక సంఘాల మాదిరిగానే రూర్బన్ పంచాయతీల్లో పరిపాలనా విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రణాళిక, ప్రజారోగ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగాలు ఏర్పాటుచేసి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించనున్నారు. ఆయా విభాగాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించుకోవచ్చు. ఇల్లు, భవన నిర్మాణాలకు అనుమతులు, అక్రమ నిర్మాణాల నియంత్రణకు పురపాలక సంఘం మాదిరిగానే కంట్రీప్లానింగ్ విభాగాన్ని ఏర్పాటుచేయనున్నారు. సచివాలయాల్లో అధికంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, రూర్బన్ పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్లుగా నియమించి విధులను అప్పగిస్తారు.

జిల్లాలో 18 రూర్బన్ పంచాయతీలు

జిల్లాలో మొత్తం 385 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో అత్యధిక ఆదాయం, జనాభా కలిగిన 18 గ్రామాలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తించారు. వాటిలో అమలాపురం రూరల్ మండలం బండారులంక, పేరూరు, కామనగరువు, అంబాజీపేట మండలం మాచవరం, అల్లవరం మండలం కొమరగిరిపట్నం, ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామం, ఐ.పోలవరం మండలం కేశనకుర్రు, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, కాట్రేనికోన, కొత్తపేట మండలంలో వానపల్లి, కొత్తపేట గ్రామాలు, మండపేట మండల పరిధిలో ఏడిద, కేశవరం, ద్వారపూడి, రావులపాలెం మండలం రావులపాలెం, రాయవరం మండలం చెల్లూరు, రాజోలు మండలం తాటిపాక, రాజోలు గ్రామాలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తించారు. వీటితో పాటు 3వేలకు పైగా 10వేలలోపు జనాభా కలిగి రూ.30లక్షల నుంచి రూ.కోటి ఆదాయం కలిగిన పంచాయతీలను గ్రేడ్-1గాను, 2వేల నుంచి 3వేలలోపు జనాభా కలిగిన సొసైటీలను గ్రేడ్-2గాను, 2వేలలోపు జనాభా కలిగిన పంచాయతీలను గ్రేడ్-3గా గుర్తించే పనిలో జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నిమగ్నమై ఉంది. అంతే కాకుండా పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ అభివృద్ధి అధికారి పీడీవోగా పేరు మార్చనున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సిబ్బందికి ఎప్పటికప్పుడు పదోన్నతులు లభించనున్నాయి. ప్రధానంగా రూర్బన్ పంచాయతీల్లో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి నియమిస్తారు. ఆయన కింద వివిధ కేటగిరిల్లో ఉద్యోగులను నియమించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాల కోసం అధికారులు ఎదురుచూస్తున్నారు.



సౌర విద్యుత్ ప్లాంటు కోసం నడిపూడి వాటర్ స్టోరేజ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మహేష్‌కుమార్

సోలార్‌తో స్థానిక సంస్థలకు ఆర్థిక ఆదా

- కలెక్టర్ మహేష్‌కుమార్
- సౌర విద్యుత్ ప్లాంటు స్థల పరిశీలన

అమలాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో సూర్యఘర్ పథకంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల స్థాపన ద్వారా విద్యుత్ చార్జీలు గణనీయంగా తగ్గి స్థానిక సంస్థలు ఆర్థికంగా బలపడతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం అమలాపురం రూరల్ మండలం సమ్మర్ స్టోరేజ్ చెరువు వద్ద ప్రతిపాదిత సోలార్ ప్లాంటు స్థలాన్ని మున్సిపల్, విద్యుత్ అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు సౌర విద్యుత్ దోహదపడుతుందని, ఇందుకోసం సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ యూనిట్లు అమలుచేస్తే నెలవారీ విద్యుత్ బిల్లులు గణనీయంగా తగ్గుతాయని, అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించవచ్చని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో అందిస్తున్న ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండున్నర దశాబ్దాల పాటు పనిచేసే సోలార్ యూనిట్ల నిర్వహణలో తక్కువ ఖర్చులు అవుతాయని చెప్పారు. మున్సిపల్ కార్యాలయాలు, వీధి విద్యుత్ లైట్లు, ప్రభుత్వ భవనాలకు సౌర వినియోగం చేయడం ద్వారా వార్షిక విద్యుత్ ఖర్చులను భారీగా తగ్గించుకోవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా జరిగిన పర్యటనలో ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజేశ్వరి, కమిషనర్ నిర్మల్ కుమార్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

కల్తీ అల్పాహారం తిని 20 మందికి అస్వస్థత

అంబాజీపేటలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి విషయం 9





కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నిషాంతి.. సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల ఆర్జేడీ నాగమణి

కొత్త ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేయాలి

జేసీ నిషాంతి సూచన

అమలాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతోపాటు నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పిలుపునిచ్చారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం మెగా డీఎస్సీ 2025లో నియమితులైన ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి పరిచయ కార్యక్రమం డీఈవో సలీంబాషా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిషాంతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల జీవితంలో కీలకమైన రోజుగా భావించి గుణాత్మక విలువలు, నాణ్యమైన విద్యాభ్యాసన ద్వారా జిల్లాను విద్యారంగంలోను తద్వారా రాష్ట్ర రంగంలో అగ్రగామిగా నిలపాలని ఆమె కోరారు. విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన ఉన్నత విద్యను అందించి వారి ఉన్నత భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో సమగ్రంగా విద్యా ప్రమాణాలను ఆధునిక సాంకేతికత జోడించి ఉత్తమ ఫలితాలుగా తీర్చిదిద్దాలని జాయింట్ కలెక్టర్ విజ్ఞప్తిచేశారు. ప్రతీ పాఠానికి స్పష్టమైన లెర్నింగ్, అవుట్ కమ్స్ ఉండేలా పాఠ్య ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆమె సూచించారు. పాఠశాల విద్యా క్యాలెండర్‌ను అనుసరించి విద్యాబోధన చేయాలన్నారు. ఆర్డీవో కె.మాధవి మాట్లాడుతూ వ్యక్తిగతంగా విద్యార్థి అభిరుచులు, సామర్థ్యాలను గుర్తించి, తల్లిదండ్రులు సమావేశాలను నిర్వహించి విద్యా పురోగతిపై పరస్పరం చర్చలు సాగించాలని సూచించారు. పాఠశాల, తల్లిదండ్రుల అనుబంధాన్ని బలోపేతం చేయాలని కోరారు. అధ్యక్షత వహించిన జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే పాత్రలో అన్ని కోణాల్లోను ఆలోచించి పనిచేయాలని సూచించారు. డిజిటల్ యుగంలో ఉపాధ్యాయులు స్మార్ట్ బోర్డులు, ఆన్‌లైన్ కోర్సులు, యాప్‌లు, వీడియోల ద్వారా బోధనను నేర్చుకోవాలని సూచించారు. విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఉపాధ్యాయులు నిరంతరం నేర్చుకోవడం, సాంకేతికతకు అప్‌డేట్ కావడం అత్యావసరమన్నారు. ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో కీలక భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష ఏపీసీ జి.మమ్మి, జిల్లా ఉప విద్యాశాఖాధికారి సూర్యప్రకాశం తదితరులు ఉపాధ్యాయుల కార్యక్రమంలో పాల్గొన్నారు.

మందుబాబులు సురక్షితం!



- ఏపీ ఎక్సయిజ్ సురక్షా యాప్
- ఇక నకిలీ మద్యానికి చెక్
- క్యూఆర్ కోడ్‌తో బాటిల్ చిట్టా
- నకిలీపై ఫిర్యాదు చేయవచ్చు
- నాణ్యతపై ప్రభుత్వం దృష్టి

స్కాన్ చెయ్.. నకిలీ పట్టేయ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ మద్యాన్ని పారించారు. మందుబాబుల జేబులు, ఆరోగ్యాలకు చిల్లు పెట్టారు.అయితే కూటమి ప్రభుత్వం మద్యం పాలసీని ఆసాంతం మార్చేసింది. నాణ్యమైన సరుకు, బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చింది. ధరలను తగ్గించింది. మందుబాబులకు నిజం తెలియడం ప్రధానమనే ఉద్దేశంతో ప్రభుత్వం సురక్ష ఏపీ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్ అనే యాప్‌ని అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా మద్యం తయారీ వివరాలు పక్కాగా తెలుసుకోవచ్చు. ఒకవేళ నకిలీ అయితే ఇట్టే పట్టేస్తుంది. ఆపై ఎక్సయిజ్ అధికారులు ఆ తయారీ, విక్రయదారుల పనిపడతారు. యాప్‌పై ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

వైసీపీ హయాంలో..

వైసీపీ ప్రభుత్వం ఎక్సయిజ్ శాఖను అతలాకుతలం చేసిన విషయం తెలిసిందే. నాసిరకం మద్యాన్ని ఐదేళ్లు పారించడానికి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ-సెబ్) అంటూ ఓ కొత్త విభాగాన్ని సృష్టించారు. మద్యం అమ్మకాలు, అక్రమాలపై అసలు నిఘా, తనిఖీలు, చర్యలు లేకుండా చేశారు. నాసిరకం మద్యాన్ని అధిక రేట్లతో తాగించారు. అలాగే సొంత తయారీ మద్యాన్ని తాగించడానికి బ్రాండెడ్ మద్యాన్ని రాకుండా చేశారు. ఎంసీ వంటి అంతర్జాతీయ కంపెనీలు సైతం రాష్ట్రానికి ఐదేళ్లు రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ అన్ని బ్రాండ్లు రాష్ట్రంలో అడుగు పెట్టాయి. ఇప్పుడు నాణ్యమైన సరుకు దొరుకుతున్నా.. నాలుగు బాటిళ్లలో ఒకటి కల్తీ అంటూ వైసీపీ నాయకులు యాగీ చేస్తున్నారు.

కూటమి వచ్చాక..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జగన్ పిచ్చి బ్రాండ్ల తయారీకి అడ్డుకట్ట వేశారు. తమిళనాడు, కర్నాటక, కేరళ, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లోని మద్యం పాలసీపై ఉన్నతాధికారులతో అధ్యయనం చేయించారు. కమిటీ నివేదిక ఆధారంగా కొత్త పాలసీ వచ్చింది. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో ప్రైవేటు షాపులు, పాత మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. అంతర్జాతీయ స్థాయి కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకొంది. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్, ఖాసా డిస్టలరీస్ కంపెనీ, పీరి డిస్టలరీస్ లిమిటెడ్ వంటి కంపెనీలతో ఒప్పందాలు కుదిరాయి. నాణ్యమైన బ్రాండ్లు సరసమైన ధరలతో అందుబాటులోకి వచ్చాయి.ప్రస్తుతం 200 వరకూ బ్రాండ్లు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరిలో 400 వరకూ ప్రైవేటు మద్యం దుకాణాలు, 30 బార్లు ఉన్నాయి. నెలకు రూ.300 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి.

ఇప్పుడు సురక్ష యాప్

నకిలీ మద్యం తయారీ, విక్రయాలు లేకపోయినా.. ఒకవేళ ఎక్కడైనా చాటుమాటుగా అధికారుల కళ్లుగప్పి చేస్తున్నా వారి పనిపట్టడానికి ఏపీ ఎక్సయిజ్ సురక్ష యాప్‌ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. దీంతో నాణ్యతపై ఎవరినీ అడగాల్సిన అవసరం లేదు. యాప్ ద్వారా సులభంగా తెలుసుకోవచ్చు. ఎక్కడ, ఏ పరిమాణంలో, ఏ బ్రాండ్ మద్యం కొనుగోలు చేసినా వినియోగదారుడు చక్కన ఆ బాటిల్‌లో మద్యం వివరాలు తెలుసుకోవచ్చు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి సురక్ష యాప్ ఏపీ ఎక్సయిజ్ డిపార్ట్‌మెంట్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. సెల్‌ఫోన్‌లో ఉండే క్యూఆర్ కోడ్ స్కానర్‌తో బాటిల్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే బ్రాండ్ పేరు, లైసెన్స్, తయారీ స్థలం తదితర వివరాలు వస్తాయి. ఒకవేళ మద్యం నకిలీ అయితే చట్టబద్ధమైన హెచ్చరిక మెసేజ్ వస్తుంది. 'డిటెయిల్స్ నాట్ ఫౌండ్' అని వచ్చినా నకిలీ మద్యమనే అర్థం చేసుకోవాలి. యాప్‌లోని సమాచారం రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుంది. వినియోగదారుడు ఎక్సయిజ్ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

సురక్షా యాప్‌తో సులభంగా



సురక్షా-ఏపీ ఎక్సయిజ్ యాప్‌తో మద్యం నాణ్యత సులభంగా తెలుసుకోవచ్చు.నకిలీ మద్యం తయారీ, విక్రయాలు లేవు. ఎప్పటికప్పుడు మద్యం దుకాణాలు,బార్లు తనిఖీలు చేసి నమూనాలను ల్యాబ్‌లకు పంపిస్తున్నాం. ఇప్పటి వరకూ నకిలీ ఆనవాళ్లు లభ్యం కాలేదు.నిరంతర నిఘాతో పాటు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశాం. అక్రమ మద్యం, సారా సమాచారాన్ని ఎక్సయిజ్ అధికారులకు చేరవేస్తే వివరాలు గోప్యత పాటిస్తాం.

- లావణ్య, ఎక్సయిజ్ సూపరింటెండెంట్

ఎంపీని కలిసిన ఉపాధి హామీ పథకం కేంద్ర బృందం

అమలాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి కేంద్రబృందం శుక్రవారం అమలాపురంలోని ఎంపీ గంటి హరీష్‌మాధుర్ నివాసగృహంలో కలిశారు. జిల్లాలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ఎంపీకి వివరించారు. దీంతో ఎంపీ కొన్ని సూచనలు చేశారు. పీఎంజీఎస్‌వై నిధుల నుంచి బోడసకుర్రు, బెండమూర్లంక వరకు నిర్మించిన ఏటిగట్టు రోడ్డు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని, నాణ్యతా ప్రమాణాలతో నిర్మించడం జరిగిందని తెలిపారు. పీఆర్ డిపార్టుమెంటుకు ఎంపీ అభినందనలు తెలిపారు. బృందంలో కోఆర్డినేటర్ డి.రాంబాబు, సీపీవో మురళీ, పీఆర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్నం రాంబాబు ఉన్నారు.



ఎంపీ హరీష్‌మాధుర్‌ను కలిసి ఉపాధిహామీ పథకం పనులను వివరిస్తున్న బృందం సభ్యులు



నాగుల్లంకలో వాటర్‌గ్రిడ్ పనుల్లో ట్రంక్‌పైపులైన్ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టుతో స్వచ్ఛమైన తాగునీరు

- అఖండ గోదావరి జలాలను శుద్ధిచేసి తాగునీరుగా అందిస్తాం
- వాటర్‌గ్రిడ్ మెగా ప్రాజెక్టు ట్రంక్ పైపులైన్ పనులకు ఎమ్మెల్యే గిడ్డి భూమిపూజ

పి.గన్నవరం,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపట్టిన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా తాగునీరు ఎద్దడి లేకుండా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టులో భాగంగా నాగుల్లంకలో శుక్రవారం ట్రంక్‌పైపులైన్ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పంటకాల్వల్లో జలాలను మనమే కలుషితం చేస్తున్నామని, మనం ముందు మనం మారితే సమాజం మారుతుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ నేతృత్వంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తవుతుందని, ఆయా ప్రాంతాలకు పూర్తిస్థాయిలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కళ్యాణచక్రవర్తి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఆర్ అండ్‌బీ రహదారి చెంతనే 50 కిలోమీటర్ల మేర ట్రంక్ పైపులైన్ ఉంటుందని, క్లస్టర్ల పరిధిలో మరో 100 కిలోమీటర్ల పరిధిలో పైపులైను ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, రాష్ట్ర నాటకరంగా అకాడమీ డైరెక్టర్ చెల్లిబోయిన గంగాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రవీంద్రబాబు, ఎంపీడీవో జి.మల్లిఖార్జునరావు, జేఈ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం
సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శకద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శా తం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం
సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం

జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.





అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథ, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

జల్ సంచాయ్‌జన్ భాగీధారిలో ఆర్ఎంసీకి
జాతీయ స్థాయిలో నాలుగో స్థానం



రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. నీటి సంరక్షణ చర్యలకు గాను దేశంలో నాలుగోవ స్థానాన్ని రాజమహేంద్రవరం కైవశం చేసుకుంది. దేశంలో 2024-25గా కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జలసంచాయ్ జన భాగిదారి (జేఎస్‌జేబీ) 1.0 ర్యాంకింగ్స్ ప్రకారం దేశవ్యాప్తంగా చేపట్టిన నీటి సంరక్షణ పనుల్లో రాజమహేంద్రవరం నగరం ఈ ఘనత సాధించింది. జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో చత్తీస్‌ఘడ్ రాయ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ నిలిచింది. రెండో స్థానంలో తెలంగాణ నుంచి గ్రేటర్ హైదరాబాద్ సాధించింది. మూడో స్థానంలో ఉత్తరప్రదేశ్ నుంచి గోరఖ్‌పూర్ కార్పొరేషన్ నిలిచింది. నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్ నుంచి రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ నిలిచింది. ఈ అవార్డుతో పాటు రూ.2 కోట్లు నగదు బహుమతి కూడా రాజమహేంద్రవరం కైవసం చేసుకుంది. అ అవార్డును వచ్చేనెల 18న నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అందుకోనున్నారు. నగరం వ్యాప్తంగా 13,298 నీటి సంరక్షణ పనులు చేపట్టినట్టు కేంద్ర బృందం పర్యటనలో ఫొటోలతోపాటు అప్లోడ్ చేశారు. జాతీయనీటీ కమిషన్ ఈ బృందం జూన్‌లో డిల్లీ నుంచి రాజమహేంద్రవరం వచ్చి పర్యటించింది. అప్పుడు నగరంలో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, సీవేజ్ ట్రీ ట్మెంట్ ప్లాంట్, కంబాలచెరువు, ప్రభుత్వ కార్యాలయాలు, వార్డు సచివాయాలల్లో ఇంకుడు గుంతలు పరిశీలించారు. వర్షపు నీటిని వడిసిపట్టడం, నీటిని నిల్వ చేయడం, పొదుపు చేయడం వంటి వాటిని ప్రామాణికంగా తీసుకుని ఈ ర్యాకింగ్‌ను జాతీయ జల్‌శక్తి శాఖ రాజమహేంద్రవరానికి నాలుగో స్థానం ఇచ్చింది. జాతీయ స్థాయిలో 4వ ర్యాంక్ రావడం పట్ల కమిషనర్ రాహుల్ మీనా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనతలో కీలక పాత్ర పోషించిన అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. భూగర్భ జలాల పెంపుదల, వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించడం, ప్రజల భాగస్వామ్యం అనే ఈ మూడు ప్రధాన లక్షాలతో ఈ విజయం సాధ్యమైందని మునిసిపల్ కమిషనర్ అన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మామిడికుదురు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీతీరంలో వేంచేసి ఉన్న అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం మూడో రోజు ఉభయ దేవేరులతో అలంకరించిన పవిత్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి చక్రపెరుమాళ్‌కు సమర్పించారు. 108 కలశాలతో స్వామి-అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం పవిత్ర అవరోహం, మహాపూర్ణాహుతి, శ్రీవారికి ఏకాదశ ఫలరస స్నపన తిరుమంజన సేవను ఘనంగా చేశారు. లోకకల్యాణార్థం శ్రీవారి శాంతి కల్యాణం నిర్వహించారు. చతుష్టానార్చనలతో ప్రారంభించిన ఈ పవిత్రోత్సవాలు శ్రీపుష్పయాగం, రుత్విక్ సన్మానంతో ముగిశాయి. శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి శిష్య బృందం, చలమచర్ల కృష్ణమాచార్యులు, ఆలయా ర్చకులు ఆధ్వర్యంలో సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఉత్సవాలను భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఘనంగా నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

108 కలశాలతో స్నపన తిరుమంజన సేవ
ముగిసిన బాలబాలాజీ పవిత్రోత్సవాలు



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఏసీ సత్యనారాయణ

సామర్లకోటలో బాలుడి కిడ్నాప్

- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

సామర్లకోట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ శివారు ఏడీబీ రోడ్డులోని మట్టపల్లి వారి చెరువు మైదాన ప్రాంతానికి చెందిన గుడారాలలో నివసిస్తున్న సంచారజీవులకు చెందిన ఐదేళ్ల బాలుడు గురువారం రాత్రి కిడ్నాప్‌కు గురయ్యాడు. అప్పటివరకూ తమ చెంతనే నిద్రించిన తమ కుమారుడిని ఎవరో అపహరించుకుపోయారని సామర్లకోట పోలీసులకు దేవర కోటేష్ ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎస్పీ శ్రీహరిరాజు ఆదేశాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం బాలుడిని టిడ్కో కాలనీలో ఒక ఇంటిలో ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. సీ-9 బ్లాక్, ఎస్ఎఫ్-6కు చెంది కేతినీడి దేవి, ఆమె భర్త వీరబాబు కలిసి బాలుడిని కిడ్నాప్ చేసినట్టు పోలీసులు నిర్ధారించి వారిద్దరినీ అరెస్ట్ చేసినట్టు డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. బాలుడిని శుక్రవారం రాత్రి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా కేతినీడి దేవి గతంలో సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోరీల్లో కేసుల్లో నిందితురాలిగా ఉన్నట్టు సీఐ కృష్ణభగవాన్ పేర్కొన్నారు.

రామ్‌గోపాల్ వర్మపై
దేశద్రోహి కేసు పెట్టాలి
రాజమండ్రి త్రీటౌన్‌లో కేసు నమోదు

రాజమహేంద్రవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మపై దేశద్రోహి కేసు నమోదు చేయాలని తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామాజిక విద్వేషాలకు ఆజ్యం పోస్తున్న యాంకర్ స్వప్న, వాటిని ప్రసారం చేస్తున్న ఛానల్ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. రామ్‌గోపాల్ వర్మ ఆగడాలు రోజురోజుకూ శ్రుతి మించిపోతున్నాయని ఆరోపించారు. హిందూ దేవుళ్లపై అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో మాట్లాడుతూ మత సామరస్యానికి విఘాతం కలిగిస్తున్నారన్నారు. ఆర్జీవీ వ్యాఖ్యలు యువత జీవితాలకు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వాటిని స్వప్న మరింత రెచ్చగొడుతోందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని త్రీటౌన్ సీఐ అప్పారావు తెలిపారు.

24 మందికి రూ.2.52 లక్షల ఫైన్

ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు, అంగర, మండపేట, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 24 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరిచారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరికి రూ.10,500 చొప్పున జరిమానా విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ కుమార్ తీర్పు చెప్పారు.

నిన్న రూ.1500.. నేడు రూ.800

- అధిక సంఖ్యలో యానాం మార్కెట్‌కు చీరమేను
- సగానికి సగం తగ్గిన ధర



యానాం పుష్కర్‌ఘాట్ వద్ద చీరమేను కోసం మాంసాహార ప్రియులు



యానాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో శనివారం చీరమేను అమ్మకాలు, కొనుగోళ్లతో జాతరను తలపించింది. తూర్పుగాలుల సమయంలో ఈ చీరమేను మత్స్యకారులకు దొరుకుతుంది. తూర్పుగాలుల సయయంలో నీటి అడుగు భాగం నుంచి ఉపరితలం(నీటిపైకి)మీదకు చేరుతుంది. యానాంలో శనివారం అధిక సంఖ్యలో చీరమేను దొరకడంతో మత్స్యకారులకు కాసుల వర్షం కురిపించింది. ఒక్క రోజే సుమారు రూ.20 లక్షల మేర వ్యాపారం జరిగింది. ఉదయం నుంచి అధికసంఖ్యలో మార్కెట్‌కు చీరమేను రావడంతో రాజీవ్ బీచ్‌లోని పుష్కర్‌ఘాట్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. బకెట్లు, బిందుల్లో చీరమేను యానాం పుష్కరఘాట్ వద్ద గల మార్కెట్‌కు తీసుకువస్తున్నారు. రెండు రోజుల క్రితం సేరు(1లీటరు) రూ.1500 నుంచి రూ.1600 వరకు అమ్మడైతే శనివారం రూ.750 నుంచి 800వరకు విక్రయించారు. ధర తగ్గిందని తెలియడంతో మాంసాహర ప్రియులు బకెట్లను హాట్‌కేక్‌లగా కొనుగోలు చేసి పట్టుకునిపోయారు, మరో రెండు రోజులపాటు ఇదే కొనసాగితే ధర రూ.500 వరకు వచ్చే అవకాశం ఉంది.

రోడ్డు ప్రమాదంలో
ర్యాలి యువకుడి మృతి

కడియం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కడియం మండలం వెంకయ్యపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ర్యాలికి చెందిన బందెల రామాంజనేయులు(23)ని ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన మహేష్ మోటారుసైకిల్‌పై ఎక్కించుకుని ఓ శుభకార్యానికి తీసుకెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా రావులపాలెం వైపు వెళుతున్న లారీని ఢీకొనడంతో రామాంజనేయులు దుర్మరణం పాలయ్యాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.ధనలక్ష్మీప్రసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర చిత్రలేఖనం పోటీల్లో కల్యాణికి తృతీయస్థానం

మండపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో మండపేట మున్సిపల్ గౌతమి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న చల్లా యజ్ఞకళ్యాణి వేసిన చిత్రానికి రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం దక్కిందని ప్రధానోపాధ్యాయుడు దంటు శ్రీను తెలిపారు. జిల్లాలో ప్రథమస్థానం దక్కించుకోగా రాష్ట్రస్థాయిలో తృతీయస్థానంలో కైవశం చేసుకున్నట్టు చెప్పారు. అమరావతిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నుంచి కళ్యాణి అవార్డు అందుకుందన్నారు. రాష్ట్రస్థాయిలో 13మంది విద్యార్థులు జీఎస్టీ 2.0పై నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ విద్యార్థికి అవార్డు దక్కడం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



సీఎం చంద్రబాబు నుంచి బహుమతి అందుకుంటున్న యజ్ఞకళ్యాణి

జాతీయ కబడ్డీ పోటీలకు ప్రియాంక ఎంపిక




ప్రియాంకను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని కబడ్డీ క్రీడలో జాతీయ స్థాయికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో గొల్లలమామిడాడలో నిర్వహించిన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర రాష్ట్ర కబడ్డీ జట్టు ఎంపిక పోటీల్లో తమ కళాశాలలో బీఎస్సీ సెకండియర్ విద్యార్థిని ఎల్.ప్రియాంక కనబరిచి 2025-26కుగాను సౌత్‌జోన్ ఉమెన్ ఇంటర్ కాలేజి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని వైస్ ప్రిన్సిపాల్ ప్రభల శ్రీవల్లి, వై.సుధారాణి, ఎ.నాగు తదితరులు అభినందించారు.

వరద ముంపులోనే
గండిపోశమ్మ ఆలయం



దేవీపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో స్వయంభువుగా వెలిసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరుగాంచిన మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం వరదనీటిలో ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలో గోదావరి నది పొంగి ప్రవహించడంతో వరదనీరు చేరి అప్పటి నుంచి ఆలయం వదరలోనే ఉండిపోయింది. గోదావరి తగ్గుముఖం పట్టినప్పటికీ కాఫర్‌డ్యాం బాక్ వాటర్ కారణంగా ఆలయాన్ని వరద వీడలేదు. మరో వారం రోజుల్లో ఆలయ పరిసరాల్లో వరద తగ్గుముఖం పట్టే అవకాశముందని స్థానికులు తెలిపారు.



కల్ప వృక్ష వాహన సేవను తిలకిస్తున్న భక్తులు

- భక్తులను కటాక్షించిన వాడపల్లివాసుడు
- శోభాయాత్రగా గోదావరి నదీ జల సంగ్రహణ
- ఘనంగా లక్ష కుంకుమార్చన
- శాస్త్రోక్తంగా చూర్ణోత్సవం
- కల్కి అలంకరణలో అశ్వ వాహనంపై విహరించిన శ్రీవారు
- వాడపల్లిలో 8వ రోజుకు వార్షిక బ్రహ్మోత్సవాలు

కల్పవృక్షంపై దేవదేవుడు

ఆత్రేయపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం వేకువజామున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఉదయం 9.15 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పంచామృత మండపారాధన కనుల పండువగా నిర్వహించారు. అనంతరం మేళతాళ, మంగళవాయిద్యాలతో శోభాయాత్రగా గౌతమి గోదావరి వద్దకు వెళ్లి వేదమంత్రాలతో గోదారమ్మకు పూజలు నిర్వహించి నదీ జలసంగ్రహణ జరిపారు. గోదావరి జలాలను తీసుకువచ్చి మహా స్నపనం గావించారు. లక్ష కుంకుమార్చన, ప్రధాన హోమాలు నిర్వహించారు. శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి అశేష భక్తజనం నడుమ కల్పవృక్ష వాహనంపై విహరించారు. సాయంత్రం యాగశాలలో హోమాలు, శ్రీమహాలక్ష్మి మంత్రపూర్వక మహాలక్ష్మి హోమం, నీరాజన మంత్రపుష్పం జరిపారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు రంగులు చిమ్ముతూ చూర్ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రాత్రి 7.01 గంటలకు కల్కి అలంకరణలో శ్రీవారు అశ్వ వాహనంపై అధిరోహించి విద్యుత్ కాంతులు, మేళతాళ మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ మాడవీధుల్లో విహరించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, జాయింట్ కలెక్టర్ నిషాంతి, రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



గోదావరి జలాలను తీసుకువస్తున్న అర్చకస్వాములు



వసంత మండపంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న దృశ్యం



చూర్ణోత్సవంలో సందడి చేస్తున్న ఈవో, సిబ్బంది



అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్‌కి వేదాశీర్వచనం ఇస్తున్న అర్చకస్వాములు



జాయింట్ కలెక్టర్ నిషాంతికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో



రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఉప కమిషనరు సూర్యచక్రధరరావు

భక్తిశ్రద్ధలతో సత్యదీక్షల స్వీకరణ



సత్యదీక్షలు స్వీకరించి పూజల్లో పాల్గొన్న దీక్షాపరులు

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధి శుక్రవారం పసుపుదళంతో శోభసంతరించుకుంది. స్వామివారికి అత్యంత ఇష్టమైన సత్యదీక్షలు స్వీకరించే ప్రత్యేకరోజు కావడంతో అధికసంఖ్యలో భక్తులు సత్యదీక్షలు స్వీకరించారు. అన్నవరం పరిసర ప్రాంతాలు వివిధ ప్రాంతాల్లో సుమారు 3వేలమంది సత్యదీక్షలు స్వీకరించినట్టు అధికారులు తెలిపారు. ప్రతీఏటా ఆశ్వీయుజ మాసంలో వచ్చే మఖనక్షత్రం రోజున ఈ దీక్షలు స్వీకరించి కార్తీక మాసంలో వచ్చే మఖ నక్షత్రంతో సత్యదీక్షావిరమణ జరుగుతుంది. రత్నగిరిపై స్వామివారి వార్షిక కల్యాణమండపంలో దీక్షాపరులు గురుస్వాములు, అర్చకస్వాములు చేతులమీదుగా దీక్షలు స్వీకరించారు. సత్యదీక్షల ప్రచారకర్త నల్లమిల్ల కృష్ణబాబు ఆధ్వర్యంలో జగ్గంపేట, ఏలేశ్వరం, కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాలలో సుమారు వెయ్యిమంది సత్యదీక్షలు స్వీకరించారు.

సత్యదేవుడికి జన్మనక్షత్రపూజలు

స్వామి జన్మనక్షత్రం మఖ సందర్భంగా ప్రధానాలయంలో మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింప చేశారు. మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించి పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం పట్టువస్త్రాలను ధరింపచేశారు. ప్రత్యేక పుష్పాలంకరణలో స్వామి, అమ్మవార్లు దర్శనమిచ్చారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా చండీహోమం

రత్నగిర క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు గణపతిపూజతో అర్చకస్వాములు కార్యక్రమం ప్రారంభించారు. అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతిగా వించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా వ్రతాల నిర్వహణ

1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా : అన్నవరం దేవస్థానం ఈవో

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈనెల 22 నుంచి ప్రారంభంకానున్న కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి సత్యదేవుడి వ్రతాలు ఆచరించుకునేందుకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్రతాల నిర్వహణ చేపట్టాలని ఈవో వీర్ల సుబ్బారావు వ్రతపురోహితులను కోరారు. శుక్రవారం వ్రతపురోహితులతో సమావేశమయ్యారు. భక్తుల సందేహాలను విసుగుచెందకుండా నివృత్తి చేయాలని, పర్వదినాలలో దేవస్థానం అందించే సర్క్యులర్‌కు అనుగుణంగా విధులకు పూర్తిగా హాజరుకావాలని, ఆలయఖ్యాతి ఇనుమడింపచేసే విధంగా వ్రతపురోహితులు వ్యవహరించాలని పేర్కొన్నారు. వ్రతపురోహితులకు ఏమైనా సమస్యలుంటే తనవద్దకు తీసుకురావాలని పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. ఈ ఏడాది సుమారు 1.50 లక్షల వ్రతాలు జరుగుతాయని అంచనా వేస్తున్నామన్నారు. సమావేశంలో కల్యాణబ్రహ్మాచామర్తి కన్నబాబు, వ్రతపురోహిత సూపర్‌వైజర్లు వ్రతపురోహిత సంఘ నాయకులు మెకరాల రాజేష్, మల్లాది గురుమూర్తి వ్రత విభాగ అధికారులు ఉన్నారు.



వ్రతపురోహితుల సమావేశంలో పాల్గొన్న ఈవో, వ్రతవిభాగ అధికారులు

సత్యదేవుడికి గవర కార్పొరేషన్ చైర్మన్ పూజలు



వేదాశీర్వచనం పొందుతున్న రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర

అన్నవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం రాష్ట్ర గవర కర్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

24న తెలుగు వర్సిటీ వీసీ బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తొలి వైస్ చాన్సలర్‌గా నియమితులైన డి.మునిరత్నం నాయుడు ఈనెల 24న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈనెల 22నే రాజమహేంద్రవరం వచ్చే అవకాశం ఉంది. చిత్తూరు జిల్లా దిగుమూర్తివారిపల్లెకు చెందిన నాయుడు 1987 నుంచి 2017 వరకూ ఉమ్మడి తెలుగు విశ్వవిద్యాలయంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రాచీన తెలుగు కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఇన్‌చార్జిగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందుకున్న నాయుడు శుక్రవారం విజయవాడలో పెద్దలను కలిశారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగు విశ్వవిద్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావడమే తన కర్తవ్యంగా పనిచేస్తానని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పోలవరం భూసేకరణ స్పెషల్ కలెక్టర్ బదిలీ

రాజమహేంద్రవరం (ధవళేశ్వరం)లోని పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు(పీఐపీ) భూసేకరణ స్పెషల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్‌జీడీసీ సత్తెనపల్లి సరళావందనం బదిలీ అయ్యారు. ఆమెకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీకి నేరుగా రిపోర్టు చేయవలసిందిగా ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ ఆదేశించారు. ఆమె స్థానంలో ఎవర్నీ నియమించలేదు.

కాకినాడ ఆర్ఎంసీ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్తిని స్వప్రయోజనానికి వాడుకున్నాడన్న ఆరోపణలు రుజువు కావడంతో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్ఎంసీ) ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు పడింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ ఆర్ఎంసీలో జమేదార్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజేష్‌కుమార్ కళాశాల ప్రాంగణంలోని విలువైన చెట్లను నరికి శానిటేషన్ సూపర్‌వైజర్ కాదా శివయ్య, సెక్యూరిటీ సూపర్‌వైజర్, అలాగే పెస్ట్ కంట్రోల్ వర్కర్ సహకారంతో బయటకు తరలించినట్టు కళాశాల యాజమాన్యానికి ఈ నెల 16న తెలిసింది. అనంతరం ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో దీనిపై అడ్మినిస్ట్రేటర్ ఎస్.శ్రీధర్‌ను విచారణాధికారిగా నియమించగా జరిగిన విషయం వాస్తవమని నిర్ధారించి నివేదికను ప్రిన్సిపాల్‌కు అందజేసారు. ఈ నేపథ్యంలో సీసీఏ నిబంధనలను అనుసరించి రాజేష్‌కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు డాక్టర్ విష్ణువర్ధన్ తెలిపారు. రాజేష్‌కుమార్‌కు సహకరించిన శానిటరీ, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ ఉద్యోగులను విధుల నుంచి తొలగించవలసిందిగా సంబంధిత కాంట్రాక్టర్ ఏజెన్సీలకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అలాగే బయటకు తరలించిన కలపను స్వాధీనం చేసుకుని అడ్మినిస్ట్రేటర్ శ్రీధర్ స్వాధీనంలో ఉంచామన్నారు.

కల్తీ టిఫిన్ తిని 20 మందికి అస్వస్థత

ఆలస్యంగా వెలుగులోకి..



అంబాజీపేటలో చికిత్స పొందుతున్న బాధితులు

అంబాజీపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన 20 మంది కల్తీ అల్పాహారం తిని అస్వస్థతకు గురయ్యారు. బుధవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరంతా అంబాజీపేటలో ఉన్న హోటల్‌లో బుధవారం ఉదయం టిఫిన్ తిని అస్వస్థతకు గురయ్యారు. ఫుడ్‌పాయిజన్ కావడంతో అంబాజీపేట, అమలాపురంలోని పలు ప్రవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మాచవరం గ్రామ పరిధిలోని బెహరవారి అగ్రహారం, అంబేడ్కర్‌నగర్లకు చెందిన 20 మంది స్థానికంగా ఉన్న ఓ బెల్లం తయారీ కేంద్రం, భవన నిర్మాణ పనుల నిమిత్తం వెళ్లారు. అంబాజీపేటలోని ఓ హోటల్ నుంచి బుధవారం ఉదయం తీసుకువచ్చిన టిఫిన్ తిని అస్వస్థతకు గురయ్యారు. స్థానిక ఆర్ఎంపీల వద్ద చికిత్స తీసుకున్నారు. అయినప్పటికి వీరోచనాలు, వాంతులు తగ్గకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రవేట్ ఆసుపత్రుల్లో చేరారు. ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్న వారిని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, ఎస్ఐలు చిరంజీవి, శివకృష్ణ పరామర్శించి వివరాలు సేకరించారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

శంఖవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోడ రాంబాబు (75) అక్కడికక్కడే మృతిచెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాబు సీతంపేట నుంచి కత్తిపూడి వైపు వెళ్తుండగా అదేదిశగా వెళ్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ ఆపకుండా వెళ్లిపోవడంతో స్థానికులు, పోలీసులు వెంబడించి ఆపివేశారు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

దర్యాప్తు మొదలు..

- రాయవరంలో బాణసంచా పేలుడు ఘటనా స్థలాన్ని పరిశీలించిన ద్విసభ్య కమిటీ బృందం
- ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తరువాత పరిశీలించి న్యాయం చేస్తాం
- పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, ఐజీ రవికృష్ణల బృందం
- బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందిస్తాం : సురేష్‌కుమార్ వెల్లడి
- ఘటనాస్థలంలో ఆద్యంతం పరిశీలన.. ఆధారాలు గుర్తింపు
- పర్యటనలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా



స్థానిక అధికారులతో మాట్లాడుతున్న దిసభ్య కమిటీ సభ్యుల బృందం

అమలాపురం, మండపేట/రాయవరం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో ఈనెల 8వ తేదీన బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాద ఘటనపై అన్ని కోణాల నుంచి దర్యాప్తు జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు ద్విసభ్య కమిటీ సభ్యులు స్పష్టంచేశారు. రాయవరంలోని లక్ష్మీ గణపతి ఫైర్‌వర్క్స్‌లో బాణసంచా తయారీకేంద్రంలో జరిగిన భారీ విస్ఫోటనంలో మొత్తం పది మంది మృత్యువాతపడ్డారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు ప్రభుత్వం విచారణకు ఆదేశించి ద్విసభ్య కమిటీని నియమించింది. శుక్రవారం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ ఆర్కే. రవికృష్ణతో కూడిన ద్విసభ్య కమిటీ బృందం పేలుడు జరిగిన శ్రీలక్ష్మీగణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌ను ఆద్యంతం పరిశీలించారు. ఘటనా స్థలాన్ని సందర్శించిన తరువాత స్థానిక నిర్వాహకులు, అధికారులను విచారించారు. రాయవరం ప్రాంతీయ రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కార్మికశాఖ అధికారులతో కలిసి ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ద్విసభ్య కమిటీ సభ్యులు సమగ్రంగా విచారణ చేపట్టారు. అనంతరం రాయవరం ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక మీడియాతో వీరు మాట్లాడారు. ఫోరెన్సిక్ నివేదిక రా గానే ఘటన పూర్తి వివరాలు తెలుస్తాయి. అలాగే ప్రమాదంలో మరణించిన పది మంది కుటుంబాలకు ప్రభుత్వ సాయం అందేలా చర్యలు తీసుకుంటామని వారు స్పష్టంచేశారు. ప్రమాదానికి గల కారణాలు, ఘటన జరిగిన వెంటనే నిర్వహించిన ప్రాథమిక విచారణ నివేదికలను పరిశీలించామని వెల్లడించారు. స్థానిక అధికారులు బాణసంచా తయారీ కేంద్రం వద్ద సంబంధిత భద్రతా ప్రమాణాలు, నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశంపై సంయుక్త తనిఖీలు జరిపి తగిన లైసెన్సులు, నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఓసీ)లను సెప్టెంబరు నెలలోనే జారీ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. అయితే బాణసంచా తయారీ ప్రక్రియలో భద్రతా నిబంధనలు పూర్తిగా పాటించారా లేదా అన్న విషయంలో కొన్ని అనుమానాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక ఘటన సమయంలోను, ఆ తరువాత నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ద్విసభ్య కమిటీ సభ్యులైన సురేష్‌కుమార్, రవికృష్ణకు వివరించారు. ఘటనా స్థలంలో అణువణువునా పరిశీలిన చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారి పార్థసారథి, ఆర్డీవో డి.అఖిల, తహశీల్దార్ బి.భాస్కర్, కార్మికశాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి, పోలీసు సిబ్బంది ఉన్నారు. కాగా ద్విసభ్య కమిటీ పరిశీలన సమయంలో మీడియాతోపాటు ప్రజా సంఘాల ప్రతినిధులను కూడా దూరంగా ఉంచారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి ఆదుకుంటామని ద్విసభ్య కమిటీ సభ్యులు ఇచ్చిన హామీతో బాధితుల్లో ఒకింత చల్లబడ్డారు. సాయంత్రం 4 గంటల వరకు కమిటీ సభ్యులు అక్కడే ఉండి ఘటనకు దారితీసిన పరిస్థితులపై వివిధ కోణాల్లో విచారణ చేశారు.

విచారణలో.. అనుమతి లేదు!

బాణసంచా పేలుడు ఘటనపై ద్విసభ్య ఉన్నతాధికారులు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ ఆర్కే. రవికృష్ణ రాయవరం ఎండీడీవో కార్యాలయంలో రెండు గంటలపాటు విచారణ నిర్వహించారు. జిల్లా, డివిజన్ అధికారులను మినహా ఎవరినీ అనుమతించలేదు. విచారణ అనంతరం ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తు వేర్వేరుగా అధికారులను కలసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. అలాగే బాధిత కుటుంబ సభ్యులతోపాటు ప్రజాసంఘాల ప్రతినిధులను కూడా పిలిపించుకుని వారి గోడును అధికారులు విన్నారు. మృతులు కుటుంబాలకు రూ.50 లక్షల వంతున ఆర్థికసాయంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

మరో బాణసంచా కేంద్రం పరిశీలన

రాష్ట్ర ప్రభుత్వం రాయవరం సంఘటనపై నియమించిన ప్రత్యేక అధికారుల బృందం పేలుడు ప్రదేశానికి సమీపంలో ఉన్న మరో బాణసంచా తయారీ కేంద్రం భవానీ ఫైర్‌వర్క్స్‌ను సందర్శించి పరిశీలించింది. వాస్తవానికి పేలుడు తర్వాత భవానీ బాణసంచా తయారీ కేంద్రాన్ని అధికారులు సీజ్ చేశారు. ఇకపై ఈ కేంద్రంలో కూడా బాణసంచా తయారీకి అనుమతి ఇవ్వవద్దని అధికారులు తేల్చిచెప్పారు. కేవలం బాణసంచా విక్రయాలకు మాత్రమే తప్ప తయారీకి అనుమతి లేదని స్పష్టంచేశారు.



ఘటనలో కాలిన వస్తువులను పరిశీలిస్తున్న బృందం

త్వరలో బాధితులకు నష్టపరిహారం అందిస్తాం : వేగుళ్ల

రాయవరం బాణసంచాపేలుడు మృతుల కుటుంబాలకు త్వరలోనే నష్టపరిహారం ప్రభుత్వం అందించడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు తెలిపారు. విచారణ కోసం వచ్చిన ద్విసభ్య అధికారులను కలిసి మాట్లాడడం జరిగిందని, బాధితులకు న్యాయం చేసేందుకు వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రాత్రికి రాత్రే హైవేపై లారీల మాయం!

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్న రాజానగరం పోలీసులు

రూ.42 లక్షల విలువైన లారీ స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐ

రాజానగరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): హైవేపై లారీల చోరీకి పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర ముఠాను ఎట్టకేలకు రాజానగరం పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలంగా హైవేపై పార్క్ చేసిన లారీలను అపహరించి, రాత్రికి రాత్రే మాయం చేయడమే పనిగా ఎంచుకున్న ఈ ముఠా కోసం పోలీసులు మూడు రాష్ట్రాల్లో గాలించి చివరకు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకర్ల సమావేశంలో డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ నిందితుల వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు గ్రామానికి చెందిన అబ్బిరెడ్డి నాగేశ్వరరావు హైవేపై గామన్ బ్రిడ్జ్ రోడ్డులో పాలచర్ల పంచాయతీ పరిధిలో ఏఎస్ఆర్ లారీ కాటా పేరున వేబ్రిడ్జ్ నడుపుతున్నాడు. దానిచెంతనే అతడి స్నేహితుడైన మన్యం గణేశ్వరరావు శ్రీకృష్ణా ఇన్ఫ్రా పేరుతో లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు నిర్వహిస్తున్నాడు. వేబ్రిడ్జ్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో లారీలను పార్కింగ్ చేస్తుంటారు. గతనెల 24న గణేశ్వరరావు తన బంధువుల వివాహం నిమిత్తం హైదరాబాద్ వెళ్తూ తనకు చెందిన నాలుగు టిప్పర్‌లను సదరు ఖాళీ స్థలంలో పార్క్ చేసి తాళాలు నాగేశ్వరరావు ఆఫీసులో ఇచ్చాడు. 26న ఉదయం వేబ్రిడ్జి వద్దకు వచ్చి చూసేసరికి గణేశ్వరరావుకు చెందిన టిప్పర్లలో ఏపీ 39 డబ్ల్యూ 7729 నెంబరు కలిగిన టిప్పర్ కనిపించలేదు. దీంతో నాగేశ్వరరావు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా ముమ్మర గాలింపు చేపట్టిన పోలీసులు ఈనెల 17న కొవ్వూరు మండలం దొమ్మేరు హైవేపై పొదల్లో లారీని స్వాధీనం చేసుకున్నారు. ఈ చోరీ కేసలో రాజస్థాన్ రాష్ట్రంలోని ధహోటగావ్, ఖోహ్రీ తాలూకా భత్పూర్ జిల్లాకు చెందిన షౌకత్ అలియాస్ షాకత్ ఖాన్, శేర్పూర్ గావ్, అల్వార్ జిల్లాకు చెందిన జమాల్ ఖాన్, సోహిల్, హైదరాబాద్‌లోని వనస్థలిపురానికి చెందిన మహ్మద్ ఫసిఉద్దీన్‌ను నిందితులుగా నిర్ధారించి అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు. చోరీకి గురైన లారీ విలువ రూ.42 లక్షలు ఉంటుందన్నారు. గతంలో వీరిపై 5 కేసులు ఉన్నాయని తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్ఐ ప్రియకుమార్, హెడ్ కానిస్టేబుల్ అప్పిరాజు, నరేష్ రాజు, సత్య నారాయణ, క్రైం సురేష్, బీవీ రమణను డీఎస్పీ అభినందించారు. కేసు దర్యాప్తు వేగవంతంగా చేపట్టిన డీఎస్పీ,సీఐను ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

పి.గన్నవరం,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):నిరక్ష రాస్యులుగాఉన్న గ్రూపుసభ్యులనుఅక్షరాస్య లుగా తీర్చిదిద్దాలని ఉల్లాస్‌నోడల్ ఆఫీసర్ జి.విజ య భాస్కర్ కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరుగుతున్న ఉల్లాస్ వలంటీర్ల శిక్షణా కార్యక్ర మంలో ఆయన మాట్లాడారు. నేర్చుకున్న అంశా లను క్షేత్రస్థాయిలో సభ్యులకు వివరించాల న్నారు.

చట్టాలపై అవగాహన

పి.గన్నవరం,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): చట్టాల పై అవగాహన పెంపొందించుకుని ప్రజలంతా జాగృతం కావాలని ఎస్ఐ బి.శివకృష్ణ కోరారు. పి.గ న్నవరం హైస్కూలు, త్రీరోడ్ సెంటర్‌లో శుక్రవారం జనజాగృతి రథంపై విద్యార్థులు, స్థానికులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ ఎన్.పట్టాభి రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజే గవాయ్‌పై దాడికి యత్నంపై ఎమ్మార్పీఎస్ ధర్నా



అమలాపురం తహశీల్దార్ దివాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురంరూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని ఖండిస్తూ శుక్రవారం అమలాపురం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. దాడి యత్నానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ వాసా ఎస్ దివాకర్‌కు అందజేశారు. ఎమ్మెస్పీ అధ్యక్షుడు మంద రామకృష్ణ, నాయకులు చుట్టుగుళ్ల సత్తిబాబు, గంపల విజయ్, నేదునూరి నతానియేలు, నూటుకుర్తి చిన్నా, నేదునూరి లక్ష్మణ్, మల్లవరపు తాతాజీ, కె.రాజు, దయా పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నం చేసిన వ్యక్తిపై కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారంతా స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఖండవల్లి ఏలియా, లంక వరప్రసాద్, చాట్ల సురేష్, లంక బాలయోగి, అయినవిల్లి సూర్యారావు, పెదపూడి రుక్మిణి, ముమ్మిడివరపు వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): గవాయ్‌పై దాడికి యత్నం ఘటనపై నిందితుని అరెస్టు చెయ్యాలని ఉప్పలగుప్తంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందించారు. వంగలపూడి నరసింహమూర్తి, తొత్తరమూడి విజయ్, ఉందుర్తి సంజీవ్, పలివెల సుధీర్‌బాబు, ఉందుర్తి శ్రీను, నవుంద్రు శ్రీను, ఉందుర్తి అర్జున్ పాల్గొన్నారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి): గవాయ్‌పై దాడికి యత్నం చేసిన వ్యక్తిని వెంటనే శిక్షించాలని ఎమ్మార్పీఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎన్‌వీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వినతిపత్రం అందించారు. మల్లవరపు రవికుమార్, తవిటికి వీరభీ మన్యుడు, ఆకుమర్తి ఆశీర్వాదం, కాప బాబూరావు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): బీఆర్ గవాయ్‌పై దాడికి యత్నించిన రాకేష్‌కిశోర్‌ను అరెస్టు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యార్లగడ్డ రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్, నాయకులు చుట్టుగుళ్ల నీళకంఠం, లూటుకుర్తి చిన్నా పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. మామిడికుదురులో మానవహారంగా ఏర్పడి తహశీల్దార్ కార్యాలయం, 216 జాతీయ రహదారిపై ధర్నా చేశారు. వినతిపత్రాన్ని తహశీల్దార్ పి.సునీల్‌కుమార్‌కు అందించారు. నూటుకుర్తి సత్యనారాయణ, యార్లగడ్డ రవి, చాట్ల సత్యనారాయణ, సిర్రా శ్రీనివాస్, తొత్తరమూడి శ్రీనివాస్, చుట్టుగుళ్ల దొరబాబు, బొంతు సుధాకర్ పాల్గొన్నారు.

అంబాజీపేట,(ఆంధ్రజ్యోతి): గవాయ్‌పై దాడికి యత్నించిన వ్యక్తిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. డిప్యూటీతహశీల్దారు సీహెచ్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని నిరసిస్తూ శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చెయ్యాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. పలివెల మోహనరావు, సవరపు రాజు, ఈతకోట బుచ్చిబాబుమాదిగ, పలివెల చిన్న మాదిగ, చెల్లూరి సుభాష్‌మాదిగ పాల్గొన్నారు.

క్వాంటమ్ ఏజ్ బిగిన్స్‌పై జిల్లాస్థాయి ప్రతిభా పోటీలు



రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికైన విద్యార్థులతో జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా

అమలాపురంటౌన్,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లాస్థాయి ప్రతిభా ప్రదర్శన పోటీలు నిర్వహించారు. క్వాంటమ్ ఏజ్ బిగిన్స్ పొటెన్షియల్స్ అండ్ చాలెంజర్ అనే అంశంపై విద్యార్థులకు ప్రతిభా ప్రదర్శన పోటీలను జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈపోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, ఉపవిద్యాశాఖాధికారి గుబ్బల సూర్యప్రకాశం, పి.రామలక్ష్మి, మూర్తి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్ బీర హనుమంతరావులు పర్యవేక్షించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 44మంది విద్యార్థులు సెమినార్‌లో పాల్గొన్నారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ఈపోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఏబీఎన్ నరసింహారావు, ఉప్పలపాటి మాచిరాజు, వీవీ బ్రహ్మానందం, వరదా శ్రీనివాస్, ఎస్.బాబులు, సీతారామలక్ష్మి, సీహెచ్ నరసింహారావు, శెట్టిమల్లి మాధురి వ్యవహరించారు. జిల్లాస్థాయిలో జరిగిన ఈపోటీల్లో అయినవిల్లి మండలం జగన్నాథపురం విద్యార్థిని ప్రథమస్థానం, ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి విద్యార్థులు ద్వితీయస్థానం సాధించారు. వీరు రాష్ట్రస్థాయిలో త్వరలో విజయవాడ జై కన్వెన్షన్ హాలులో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని డీఈవో సలీంబాషా తెలిపారు. ఈపోటీలకు సమన్వయ అధికారిగా జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు.

సాహితీరంగంలో కొర్లపాటికి ప్రత్యేక స్థానం



కొర్లపాటి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న నరసింహమూర్తి తదితరులు

అమలాపురరూరల్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సాహితీ పరిశోధనా రంగంలో ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తికి ప్రత్యేక స్థానం ఉందని ప్రముఖ కవి నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. తెలుగు సాహితీ చరిత్రలో, పరిశోధనా రంగంలో కొర్లపాటి ప్రత్యేక ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. శుక్రవారం శ్రీశ్రీకళావేదిక ఆధ్వర్యంలో ఈదరపల్లిలోని శ్రీరవితేజ జూనియర్ కళాశాలలో కొర్లపాటి శ్రీరామమూర్తి జయంతి సభ నిర్వహించారు.అంబాజీపేటకు చెందిన శ్రీరామమూర్తి ఆచార్యునిగా నిలవడం కోనసీమ వాసులు చేసుకున్న అదృష్టంగా వక్తలు పేర్కొన్నారు. కొర్లపాటి చిత్రపటానికి ప్రిన్సిపాల్ దొరబాబు, నరసింహమూర్తి, యూవీవీ సత్యనారాయణ తదితరులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కొర్లపాటి రచనలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన ఎం.అఖిల, కె.మణికంఠ, కె.అను, సీహెచ్ ఆనందకుమారి, లక్ష్మీదుర్గలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.ప్రసాద్, ఎస్.రమేష్, కె.భాగ్య, జి.సౌమ్య, పి.ప్రియభారతిపాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అమలాపురం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం విద్యానిధి పాఠశాలలో యోగా పోటీలను జిల్లాస్థాయిలో నిర్వహించారు. విద్యానిధి అధినేత ఆకుల బాపన్ననాయుడు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ తీగల నాగమాధవి, ఫిజికల్ డైరెక్టర్ యు.పావని ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. అమలాపురంలో నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు నిర్వహించినట్టు యోగాగురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు కేహెచ్‌డీ భాగ్యశ్రీ, ఎం.జెస్సికా, కె.శ్రావ్య, కె.వివేక్, టీఎస్ దేవాన్ష్, ఆర్.సాత్విక్, కె.భార్గవి, జి.వర్ధన్, సీహెచ్ రిత్విక్‌చంద్ర, కేఎస్ఎస్ హర్షిత్, ఆషిక్, ఎ.హర్షసత్య, పి.కీర్తన, ఆర్ఎస్ సత్య భవిజ, కె.శ్రీనివాస్, ఎ.విశ్వాస్‌లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై ఉద్దేశపూర్వకంగా విచారణ

పి.గన్నవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సీహెచ్‌సీ సూప రింటెండెంట్‌పై ఉద్దేశ పూర్వకంగా విచారణ వేయించారని, విచారణను వెంటనే నిలుపుదల చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను ఆసుపత్రి దంత వైద్యుడు డాక్టర్ కోటేశ్వరరావు కోరారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆసుపత్రి సిబ్బందితోకలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించి అనంతరం ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో గతనెల12న మత్తు వైద్యురాలిపై విచారణ చేశారని, నివేదిక రాకుండానే సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశించడం ఆయన గౌరవ మర్యాదలకు భంగం కలిగించే విధంగా ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. విచారణను వెంటనే నిలుపుదల చేయాలని ఆయన కోరారు. ఆసుపత్రిలో జరుగుతున్న వ్యవహారాలపై ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి ఎమ్మెల్యేకు వివరించారు. ఈవిషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో హెడ్‌నర్సు జి.రాజేశ్వరి, స్టాఫ్‌న ర్సులు జి.రాజకుమారి, సత్యవతి, సిబ్బంది ఉన్నారు.

చెత్తపై పోరుబాటలో మూడోరోజు రిలే దీక్షలు

అమలాపురం రూరల్,అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బండారులంకలో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ ఏడాది కాలంగా చెత్త తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నాయి. పులిదిండి శారద ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సరెళ్ల రామకృష్ణ, బొంతు కృష్ణమూర్తి, మెల్లం శ్రీను, రేవు శ్రీను, గోసంగి శ్రీను, సరెళ్లస త్యనారాయణ, సరెళ్ల ఏడుకొండలు, నేల సత్యనారాయణ తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని పేరూరు ఎంపీటీసీలు వాసంశెట్టి శ్రీనివాసరావు, అంజి, అంకం హిమభారతి, దాసరి డేవిడ్‌తో పాటు దంగేటి రుద్ర, దంగేటి వెంకటశెట్టి, గుత్తుల గ్రేస్, దంగేటి బాబ్జి, దంగేటి శ్రీను, వాసా దొరబాబు, యినుమర్తి లింగమూర్తి, అంకం పెదరాజు, కూర్మా క్రీస్తుబాబు, పెదపూడి బాబూరావు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు



ఈదరపల్లిలో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లిలోని శివాలయం రోడ్డులో నాయీబ్రాహ్మణ సంఘ కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శంకుస్థాపన చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. రూ.10లక్షలతో భవన నిర్మాణం చేపడుతున్నట్టు పంచాయతీరాజ్ డీఈఈ పీఎస్ రాజ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు పసుపులేటి రామకృష్ణ, పట్టణశాఖ అధ్యక్షుడు కళ్లేపల్లి గోవిందు, కార్యదర్శి నేదునూరి తరుణ్, కె.శ్రీను, కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఈదరపల్లి బొంతువారిపేటలో రూ.2కోట్లతో నిర్మిస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, ఆశెట్టి ఆదిబాబు, గొలకోటి చిన్నా, గోసంగి ఆనందరావు, కడిమి అర్జున్, పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

కడలిలో నేత్ర వైద్య శిబిరం

రాజోలు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కడలి గమళ్లపాలెంలో క్రీస్తు సంఘం ద్వారా రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల (నిడదవోలు) సౌజన్యంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 300మందికి వైద్య పరీక్షలు నిర్వహించామని డాక్టర్ సీహెచ్ నాగరాజు తెలిపారు. అనంతరం మందులు, కళ్ల జోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా నిడదవోలు ఆసుపత్రిలో ఆపరేషన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ గుణనాథ్, కొడమంచిలి ప్రసాద్, కడలి రాము, మేడిది మోహన్, టి.రవి, జ్యోతిబాబు, రాజు పాల్గొన్నారు.

రేపు సంప్రదాయ పండుగలపై వ్యాసరచన పోటీలు

అమలాపురం టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం గుళ్లపల్లి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించుకుని కళాశాల విద్యార్థులకు ఆదివారం తెలుగింటి పండుగలు-వాటి సంప్రదాయ విశేషాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు ట్రస్టు అధినేత గుళ్లపల్లి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటలకు అమలాపురం భూపయ్య అగ్రహారంలోని ఏఎస్ఎన్ కళాశాల సమీపంలో ఉన్న ట్రస్టు భవనంలో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.ప్రథమ,ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు అదేరోజు అందిస్తామన్నారు. పోటీలను విజయవంతం చేయాలని ట్రస్టు కార్యదర్శి నల్లా నరసింహమూర్తి కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): నాగుల్లంక ఫీడర్ 11కేవీ లైన్‌లో, నరేంద్రపురం సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతులు కోసంశనివారం ఉదయం ఎనిమిది నుంచి రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్టు ఏఈ కె.రాంబాబు తెలిపారు. లంకలగన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రే వుపల్లి, కనకాయలంక, నరేంద్రపురం సబ్ స్టేషన్ పరిధిలో సబ్‌స్టేషన్ పరిధిలో పోత వరం, రాజులపాలెం, ముంగండ, కె.ముంజ వరం, ముంజవరపుకొట్టు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు

అంబాజీపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి) స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ మండలస్థాయి టోర్నమెంట్, సెలక్షన్స్ శుక్రవారం నిర్వహించారు. 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి పర్యవేక్షణలో అండర్-14,17విభాగాల్లో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు.

హెచ్ఐవీపై అవగాహన

అయినవిల్లి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ, జిల్లాశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ సంస్థ, జనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయినవిల్లిలోని సిద్ధివినాయక ఆలయం ప్రాంతంలోను, పీహెచ్‌సీ, జూనియర్ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, సినిమాహాల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సంచార ప్రచార వాహనంతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జనకల్యాణ్ ప్రాజెక్టు మేనేజర్ జి.శ్రీను, ఎంపీ జ్యోతి, ఎం.శ్యామల, ఆయా కళాశాలలో ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దిని అమ్మవారికి పోలీసుల సారె



అమ్మవారికి సారె అందజేస్తున్న పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు

అమలాపురంటౌన్,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులు ముగిసిన అనంతరం విజయవాడ శ్రీకనకదుర్గమ్మవారికి సారెను సమర్పించే విధంగానే అమలాపురం రవణంవీధిలో ఉన్న మహిషాసురమర్దిని అమ్మవారికి తొలిసారిగా అమలాపురం పట్టణ పోలీసులు సారె సమర్పించారు. తొలుత రవణంవీధిలో ఉన్న మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయం నుంచి వందలాది మంది మహిళలు, భక్తులు ప్రత్యేక రథంతో ఊరేగింపుగా పట్టణ పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్నారు. పట్టణఎస్ఐ ఎన్ఆర్ కిశోర్ బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పించారు.రథంపై సారెను ఉంచి డోలు సన్నాయి, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఈకార్యక్రమాన్నితొలిసారిగా ప్రారంభించామనిఆలయ కమిటీ తెలిపింది.

ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను నియమించండి

మలికిపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లను అదనంగా నియమించాలని కన్స్యూమర్స్ ప్రొడక్ట్ కౌన్సిల్ మెంబర్ మాలే శ్రీనివాసనగేష్ శుక్రవారం ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌ను కోరారు. జిల్లా పరిధిలో ప్రస్తుతం ఒకే ఒక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. జిల్లాలో ఆహార, వ్యాపార యూనిట్లు, రెస్టారెంట్లు, బేకరీలు, పాల ఉత్పత్తి కేంద్రాలు, ప్యాకేజ్డ్ వాటర్ యూనిట్లు, విద్యా సంస్థల్లో క్యాంటీన్లు అధిక సంఖ్యలో ఉన్నాయన్నారు. వీటిని తనిఖీలు చేయడానికి ఒక్కరు సరిపోవడం లేదని, సమర్థవంతంగా పర్యవేక్షించకపోవడంతో ప్రజాఆరోగ్య పరిరక్షణలో కొంత లోటు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ప్రజాప్రయోజనార్థం ఇద్దరు లేదా ముగ్గురిని నియమించాలని కోరారు.

'మలికిపురం కళాశాలను ప్రభుత్వ పరం చేయాలి'

మలికిపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎంవీఎస్‌జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల, ఏఎఫ్‌డీటీసీ జూనియర్ కళాశాలను ప్రభుత్వ పరం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సంఖ్యలో నాలుగు వేల నుంచి వెయ్యి మందికి తగ్గిపోయిందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేకాధికారిని నియమించాలని గతంలోనే కోరానన్నారు. వెనుకబడిన గ్రామీణ పేద విద్యార్థులకు సక్రమమైన విద్యను అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'ఆక్రమణలు తొలగించండి'

ముమ్మిడివరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ 13వ వార్డు పెయ్యలవారిపేటలో తాను కౌలుకు చేస్తున్న భూమిని ఆనుకుని ఉన్న మెరక భూమిని ఓ వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించి షెడ్లు నిర్మించుకుని కిరాణా, కూల్‌డ్రింక్ షాపు పెట్టుకుంటున్నాడని, ఆక్రమణలు తొలగించాలని ఆ వార్డు కౌన్సిలర్ కోటుం జయలక్ష్మి అధికారులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు సర్వే నంబరుతో భూమిని చూపి, షాపు నిర్మాణానికి నగర పంచాయతీ నుంచి అనుమతులు పొందారని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి వెంటనే ఆ అనుమతులు రద్దుచేసి షెడ్లను తొలగింపచేయాలని, షెడ్డు నిర్మించిన వ్యక్తి పైనా, అనుమతులు ఇచ్చిన పంచాయతీ సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలనిఆమె ఫిర్యాదు చేశారు.

నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు

ముమ్మిడివరం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025 ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన ఉపాధ్యాయులందరికీ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శుభాకాంక్షలు తెలిపింది. ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎన్ మునేశ్వరరావు, కార్యదర్శి యు.వెంకట్రావు, రాష్ట్ర కౌన్సిలర్‌జీవీవీ సత్యనారాయణలతో కూడిన టీచర్స్ ఫెడరేషన్ సంఘ నాయకులు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి, విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఆకాంక్షించారు.వీరితో పాటు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం

మామిడికుదురు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. పాశర్లపూడిలంక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1995-96లో చదువుకున్న పూర్వ విద్యార్థులు స్కూలుకు రూ.22వేలు విలువైన ప్రింటర్, జిరాక్స్ మెషిన్‌ను అందించారు. గణిత ఉపాధ్యాయిని కె.సుబ్బలక్ష్మి ప్రోత్సాహంతో ఆయా వస్తువులను విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప కలశపూజ



ఉప్పలగుప్తం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): భీమనపల్లిలో శుక్రవారం రాత్రి అయ్యప్ప కలశపూజ అత్యంత నియమనిష్ఠలతో జరిగింది. సుమారు 200మంది అయ్యప్ప మాలధారులు ఈకలశ పూజలో పాల్గొన్నారు. రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, నాగరత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కలశపూజ నిర్వహణలో పేరుప్రఖ్యాతులు గడించిన కోన స్వామి గురువు కలశపూజా కార్యక్రమాలను జరిపించారు. అయ్యప్ప మాలదారులు నియమబద్ధంగా పూజలు నిర్వహించారు. అనంతరం దేశంశెట్టి లక్ష్మీనారాయణ దంపతులు అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఎన్.కొత్తపల్లిలో కోటి సంతకాల సేకరణ

ఉప్పలగుప్తం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల ఉద్యమానికి శుక్రవారం ఎన్.కొత్తపల్లిలో శ్రీకారం చుట్టారు. అమలాపురం వైసీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనూరాధ పాల్గొని రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, జిన్నూరి బాబి, అంబికాశ్రీను, మోటూరి సత్యంకాపు, కుంచే చిట్టికుమారిచిన్ని, బొడ్డు నాగేశ్వరరావు(బుజ్జి), నడింపల్లి వాసు, లంకే సూరిబాబు, జొన్నాడ శ్రీదుర్గాచిన్నా. తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ గూడాలలో వైసీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించింది. నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలోఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, పార్టీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ పాల్గొన్నారు.

బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలి

ముమ్మిడివరం,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండులో ఆక్రమణలు తొలగించి బస్టాండులోకి బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని సీపీఎం పార్టీ కోనసీమ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, జి.దుర్గాప్రసాద్, సఖిలే సూర్యనారాయణ, పాము బాలయ్యలతో కూడిన బృందం బస్టాండును పరిశీలించి ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేయాలని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. బస్టాండులో ఆక్రమణలు తొలగించి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. దీక్ష శిబిరాన్ని పలువురు సందర్శించి సంఘీభావం తెలిపారు.

టీడీపీ సభ్యత్వ బీమా రూ.5లక్షలు మంజూరు

అమలాపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాలగుమ్మి గ్రామానికి చెందిన దేవగుప్తాపు వీరవినయ్ రోడ్డు ప్రమాదంలో ఇటీవల మృతి చెందాడు. టీడీపీ సభ్యత్వం కలిగిన వినయ్ కుటుంబ సభ్యులకు పార్టీ సభ్యత్వ బీమా కింద రూ.5లక్షల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం అందజేశారు. నాయకులు మట్టా మహాలక్ష్మిప్రభాకర్, నల్లా స్వామి, కుంచే రమేష్, ఆశెట్టి ఆదిబాబు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి!



మామిడికుదురు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మొగలికుదురు ముస్లింవీధిలో మురుగునీరు రోడ్డుపై చేరి ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్య నుంచి గట్టెక్కించాలంటూ స్థానికులు కోరుతున్నారు. ముస్లింవీధిలో గల డ్రైన్ సరిగా లేకపోవడం వల్ల మురుగునీరు రోడ్డుపై చేరడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు ఏవిధమైన చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తహశీల్దార్‌గా దివాకర్



అమలాపురం రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అమలాపురం తహశీల్దార్‌గా వాసా శామ్యూల్‌దివాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఏసీబీ దాడుల్లో తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్, వీఆర్ఏ రాములను లంచం కేసులో అరెస్టు చేశారు. అనంతరం ఉప్పలగుప్తం తహశీల్దార్‌గా పనిచేస్తున్న దివాకర్‌కు అమలాపురం తహశీల్దార్‌గా ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన దివాకర్‌ను రెవెన్యూ ఉద్యోగులు అభినందించారు.

మండల పరిషత్ ఏవోగా సంఘమిత్ర



కాట్రేనికోన, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన ఎంపీడీవో కార్యాలయ పాలనాధికారిణిగా ఎం.సంఘమిత్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తపేట ఎంపీడీవో కార్యాలయం నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

శాలివాహనుల అభ్యున్నతికి కృషి

● రాష్ట్ర చైర్మన్ పెరిపి ఈశ్వర్


రావులపాలెంలో శాలివాహన కార్పొరేషన్ చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

మండపేట, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): పూర్వం శాలివాహన(కుమ్మరులకు)కేటాయించిన కుమ్మరి కుట్టలు ఆక్రమణకు గురయ్యాయని వాటిని తిరిగి పనిచేసే కుమ్మరులకు కేటాయించాలని రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్‌ను పలువురు కోరారు. కూటమిప్రభుత్వం ఏర్పాటుచేసిన శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పెరిపే ఈశ్వర్ శుక్రవారం మండపేట మండలం తాపేశ్వరం వచ్చారు. స్థానిక శాలివాహన సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ మండా వీరభద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి చైర్మన్ ఈశ్వర్‌తోపాటు కార్పొరేషన్ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రామస్థాయిలో కుమ్మరులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అలాగే కుమ్మరుల కులవృత్తి చేసుకునేందుకు మట్టితోపాటు షెడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని పలువురు కోరారు. సమావేశంలో చైర్మన్‌ను సంఘం తరపున సత్కరించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరభద్రరావు, కార్పొరేషన డైరెక్టర్‌లు, మాచవరపు విజయకుమారి, శ్రీనువాస్, పసలపూడి శ్రీనువాస్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారును కలిసిన ఈశ్వర్

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంలో రాష్ట్ర శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరెపి ఈశ్వర్ కొత్తపేటలో బండారు సత్యానందరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎమ్మెల్యే బండారు ఆయనను దుశ్శాలువాతో సత్కరించి మొక్కను అందించారు. శాలివాహన సంఘ అభివృద్ధి సంక్షేమ కార్యకలాపాల అభివృద్ధికి తాను పూర్తిగా సహకరిస్తానన్నారు.

శ్రీకృష్ణదేవరాయుల పాలన స్వర్ణయుగం

● కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


శ్రీకృష్ణదేవరాయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): విజయనగరం సామ్రాజ్యాన్ని పరిపాలించిన చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయుల పాలన చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో శ్రీకృష్ణదేవరాయుల 496వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటంవద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారుతోపాటు నాయకులు ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రీకృష్ణదేవరాయుల పాలనపై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, నందం వీరవెంకట సత్యనారాయణ, మైగాపుల గురవయ్య నాయుడు, బూసి విష్ణు, నందం కాశీ, చీకట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి'

రావులపాలెం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు పార్టీ కార్యాలయంవద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి 52 వినతులు స్వీకరించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించండి

● నల్లూరులో పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏవో రవి


నల్లూరులో పొలంబడిలో మాట్లాడుతున్న ఏవో రవి

కపిలేశ్వరపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పొలంబడితో మేలైన వ్యవసాయ పద్దతులను అనుసరించి సాగు మెళకువలతో వ్యవసాయంచేసే విధంగా రైతులను తీర్చిదిద్దుతామని వ్యవసాయశాఖ ఏవో రవి అన్నారు. మండలంలోని నల్లూరులో శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ విత్తనం నాటి నప్పటి నుంచి కోతవరకు క్రమంతప్పకుండా 14వారాల పాటు పొలంబడి కార్యక్రమం నిర్వహించాలన్నారు. పొలం పరిసరాల విశ్లేషణ ద్వారా పురుగులు, తెగులు విషయంలో రైతులు సొంతంగా నిర్ణయం తీసుకునే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదోవారం శుక్రవారం రోజు వరిలో ఆశించే కంకినల్లి మెడవిరుపు, బ్యాక్టీరియా, ఎండాకు తెగులు వ్యాప్తికి సంబంధించి అను కూల పరిస్థితులు, తెగు లు లక్షణాలు, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కంకినల్లి నివారణను ప్రొఫినోఫాస్ రెండు మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మెడవిరుపుకు ట్రై సైక్లాజోల్ మందు 120 గ్రాములు ఎండాకు తెగులుకు ముఖ్యం గా ఎడతెరిపి లేకుండా వర్షాలు ఉన్న ప్పుడు వాతావరణంలో అధిక తేమ శాతం, మోతాదుకు మించి యూరి యా వాడటంవల్ల ఎక్కువగా ఈ తెగులు వ్యాపిస్తుందన్నారు. నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్+టెట్రాసైక్లిన్ హైడ్రోక్లోరైడ్‌ను రెండు గ్రాములు చొప్పున లీటరు నీ టికి పిచికారీ చేయాలని సూచించారు. గ్రామవ్యవసాయ సహాయకులు చింతా రవివర్మ, సొసైటీ సీఈవో గుత్తుల సతీష్, గ్రామపెద్దలు ముత్యాల వెంకట్రా వు, రైతులు పాల్గొన్నారు.

సీసీ డ్రైను నిర్మాణానికి శంకుస్థాపన

రామచంద్రపురం(ద్రాక్షారామ),అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం పట్టణంలో రూ.20 లక్షలతో నిర్మించను న్న సీసీ డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం శంకుస్థాపన చేశారు. స్థానిక ముత్యాలమ్మ గుడివద్ద పట్టణంలో మురుగునీరు పోయేందుకు ఈడ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో రామచంద్రపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్ పాలపర్తి శ్వేతామధు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, పట్టణ కూటమి నాయకులు పాల్గొన్నారు.


డ్రైను నిర్మాణానికి శంకుస్థాపనలో చైర్‌పర్సన్, నాయకులు

ఆత్మకమిటీ సభ్యులకు సత్కారం


ఆత్మ కమిటీ సభ్యులుగా ఎన్నికైన బీజేపీ శ్రేణులను సత్కరిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యానందం

కొత్తపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకమిటీ సభ్యులుగా ఎంపికైన బీజేపీ నాయకులు పాలాటి మాధవస్వామి, మద్దింశెట్టి శ్రీనివాసరావులను శుక్రవారం రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిం చి వాటి పరిష్కారానికి కృషిచేయ్యాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంపతి కనకేశ్వరరావు, పాలూరి జయప్రకాష్ నారాయణ, కోటిపల్లి దామోదర్, గొలకోటి వెంకటేశ్వరరావు, అన్యం సత్యనారాయణ, కోటిపల్లి సుబ్రహ్మణ్యం, భమిడిపాటి లక్ష్మినారాయణలు పాల్గొన్నారు.

తహశీల్దారు రాజేశ్వరరావుకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి


టి.రాజేశ్వరరావు

ఆత్రేయపురం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి):ఆత్రేయపురం తహశీల్దారుగా పనిచేస్తున్న టి.రాజేశ్వరరావుకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. రాష్ట్రంలోని 37 మంది తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు పదోన్నతి పొందిన రాజేశ్వరరావును డిప్యూటీ తహశీల్దారు రామచంద్రమూర్తి, ఆర్ఐ భాను, సిబ్బంది, వీఆర్వోలు అభినందనలు తెలిపారు.

కపిలేశ్వరపురం ఎంపీపీగా శ్రీనివాస్


ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం మండల ఎంపీపీగా సాకా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అంతవరకు ఎంపీపీగా పనిచేసిన మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు ఇటీవల తన పదవికి రాజీనామాచేసి టీకి ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. జడ్పీసీఈవో ఆదేశాల మేరకు మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో హెచ్ భానుప్రకాష్, ఏవో జి.రాజేంద్రప్రసాద్, జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నూతన ఎంపీపీ శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించానని మోసగించాడు

● నిందితుడిపై కేసు నమోదు

ద్రాక్షారామ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ప్రేమించానని మోసగించిన వ్యక్తిపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. తాళ్లపొలం గ్రామానికి చెందిన వేండ్ర దివ్య అక్కతో మండపేట మండలం పాలతోడు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఈ ఏడాది మార్చిలో కళాశాలకు సెలవుకావడంతో దివ్య తన అక్కవద్దకు వెళ్లింది. దివ్య బావ తన మొబైల్‌కు వాట్సాప్ సౌకర్యం లేకపోవడంతో దివ్య మొబైల్ నుంచి ధాన్యం వ్యాపారి కుమారుడు మొబైల్‌కు ఆధార్, పాసుపుస్తకం పంపాడు. ధాన్యం వ్యాపారి కుమారుడు దివ్య నెంబరుకు చాటింగ్ చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలో దివ్యతో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ద్రాక్షారామ గుడికి తీసుకువెళ్లి రోల్డుగోల్డు ఉంగరం తొడిగి నిశ్చితార్థం అయిపోయిందని మోసగించాడు. అక్కడి నుంచి ఆమెను తాళ్లపొలం తీసుకువెళుతూ శారీరకంగా వాడుకున్నాడు. పెళ్లి ఊసు ఎత్తేసరికి ముఖం చాటేశాడు. యువతి బంధువులను తీసుకుని యువకుడు ఇంటికి తీసుకువెళ్లి తల్లితండ్రులను నిలదీసింది. వారుకూడా ఎదురుతిరగడంతో ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాత్‌రూమ్ కూల్చివేసిన ఘటనలో ఇద్దరికి జైలు

ద్రాక్షారామ, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెం గ్రామానికి చెందిన దుప్పలపూడి నాగమణి ఇంటిలో 2022లో కొండ్రెడ్డి వెంకట సతీష్‌నాయుడు ప్రవేశించి ఎక్స్‌కవేటర్‌తో బాత్‌రూమ్ కూలగొట్టి పైపులైను ధ్వంసం చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితులకు జైలుశిక్ష లేదా జరిమానా విధిస్తూ ఏజెఎఫ్‌సీ మేజిస్ట్రేట్ నాగేశ్వరరావునాయక్ శుక్రవారం తీర్పునిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2022లో తన ఇంటిలోకి చొరబడి నిందితుడు కొండ్రెడ్డి సతీష్ నాయుడు ఎక్స్‌కవేటర్‌తో బాత్‌రూమ్ కూల్చివేసి, పైపులైను, పవర్ మోటారు ధ్వంసం చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ తులసీరామ్ కేసు నమోదుచేశారు. దీనిపై వాదోపవాదాలు అనంతరం నేరం రుజువుకావడంతో కొండ్రె డ్డి సతీష్‌నాయుడు, కొండేపూడి శ్రీప్రసాదరావులకు ఒక్కొక్కరికీ ఒక సంవత్సరం మూడునెలలు జైలుశిక్ష లేదా రూ.11 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసులో ఏపీపీ రామతులసి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

వైసీపీ నాయకుల సంతకాల సేకరణ

కె.గంగవరం, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళా శాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నాయకులు కోటిసంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టిన విషయం విదితమే. శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పామర్రులో సంతకాల సేకరణ చేశారు. తొలుత రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిట్టూరి చిన్ని, పంపన సుబ్బారావు, వాసంశెట్టి సూరిబాబు, సాదే కపిల్, కుడుపూడి చంద్రరావు, పెన్నాడ త్రిమూర్తులు, కుడుపూడి నాని, మాసాబత్తుల ప్రసాద్ పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

● ఎమ్మార్పీఎస్ నాయకుల తహశీల్దార్‌కు వినతి


ఆలమూరు తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


ఆత్రేయపురంలో ...

ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుప్రీమ్ కోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి ప్రయత్నించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆలమూరు తహశీల్దార్ కేజే ప్రకాశ్‌బాబుకు ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ పిలుపులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి కొమ్ము నారాయుడు ఆధ్వర్యంలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నినాదాలు చేశారు. అనంతరం న్యాయమూర్తి గవాయ్‌పై దాడిపై పూర్తిస్థాయి విచారణచేసి దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము నారాయుడు, డాన్ సూరి, ఉండ్రాసపు పెద్దరాజు, ఉండ్రాసపు ప్రసాద్, లంక శ్యామ్, పెందుర్తి ఏకోబు, గిరీష్ పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిచేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర వీరరాఘవ డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దారు కార్యాలయంవద్ద దాడికి పాల్పడిన రాకేష్‌కిషోర్‌ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహశీల్దారు శ్రీరామచంద్రమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఎంఆర్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడు ఎల్.చంద్రశేఖర్, మండల యువసేన అధ్యక్షుడు ప్రేమకుమార్ పాల్గొన్నారు.

కొత్తపేటలో ఎమ్మార్పీఎస్ నిరసన

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): భారత సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండిస్తూ ఎంఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపుమేరకు ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేట తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడి యత్నానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని దాడివెనుక దాగిఉన్న పాత్రదారులు, సూత్రధారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారుకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు తొత్తరమూడి రాము, వంగలపూడి నరేంద్ర, నవండ్రు వెంకటేష్, కముజు శ్రీనివాసరావు, సిద్ధుల బ్రహ్మానందం, ఉండ్రాజవరపు నాగేశ్వరరావు, లంక రమేష్, కె.నాగేశ్వరరావు, పెదపూడి శ్రీనుపాల్గొన్నారు.

న్యాయమూర్తిపై చర్యలు తీసుకోవాలి

మండపేట(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్‌పై న్యాయస్థాన ంలో దాడికి పాల్పడిన న్యాయమూర్తిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు దూళి జయరాజుమాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళనచేసి ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.


మండపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆంజనేయస్వామిని తాకిన సూర్యకిరణాలు


ఆలమూరు మెయిన్‌రోడ్డులో ఆంజనేయస్వామి ఆలయంలోని స్వామివారిని తాకిన సూర్యకిరణాలు

ఆలమూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్‌రోడ్డులో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలోని స్వామివారిని శుక్రవారం ఉద యం ఏకాదశి పర్వదినంలో సూర్యకిరణాలు తాకాయి. స్వామివారి వక్షస్థలంపై నేరుగా సూర్యకిరణాలు పడటంతో భక్తులు ఆశక్తిగా తిలకించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకులు కాళ్లకూరి సూరిపండు ప్రత్యేక పూజలు చేశారు. గాంధీబొమ్మ సెంటర్లో ఉన్న కొండదరామాలయంలోని సీతారామలక్ష్మణ విగ్రహాలలో సీతాదేవిపై గత మూడురోజులుగా ఈ సూర్యకిరణాలు పడుతున్నాయి. శుక్రవారం సూర్యకిరణాలు పడటంతో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పింక్‌టాయిలెట్‌కు శంకుస్థాపన


మండపేటలో పింక్ టాయిలెట్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక గౌతమి మున్సిపల్ హైస్కూల్ వద్ద నిర్మించే పింక్ టాయిలెట్స్‌కు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ పతివాడ నూకదుర్గారాణితో కలిసి శంకుస్థాపన చేశారు.మహిళలు బాలికల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండపేట మున్సిపల్ కమిషనర్ టీ.వి.రంగారావు, మాజీమున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, డీ.ఈ. శ్రీనువాస్. ఏఈలు అనుష, పవన్, మెప్మా సీఎంఎం సూజాత, ఆర్‌పీలు పాల్గొన్నారు.

మద్యంషాపును తొలగించాలని ఆందోళన

ఆత్రేయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో మద్యంషాపును తొలగించాలని గ్రామస్థులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. అంకంపాలెం వెళ్లే రోడ్డులో మద్యంషాపును గ్రామంలోని కాలువ సమీపంలోని ఆంజనేయస్వామి, గాయత్రి అమ్మవారి ఆలయాల చెంతనే అర్ధరాత్రి సమయాలలో ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు పార్టీలకతీతంగా శుక్రవారం ఆందోళన చేశారు. గుడిచెంతనే ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ బ్రాందీ షాపునకు తాళాలు వేశారు. కాలువలో పుణ్యస్నానాలు, ఆలయాలకు పెద్దఎత్తున మహిళలు దర్శించుకుంటారని, చెంతనే బ్రాందీషాపును ఏర్పాటుచేశారని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

రైతు సాయం అందని వారు ఆందోళన చెందవద్దు

కొత్తపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభు త్వం పెట్టుబడి సాయం కింద అందిస్తున్న అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకానికి అర్హులై ఉండి అందలేని వా రు ఆందోళన చెందవద్దని కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం పంచాయతీ ఆవరణలో రైతు సమావేశం ఏర్పాటుచేసి సాయం అందని రైతులవద్ద నుంచి అర్జీలను తీసుకుని సంబంధిత రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కంఠంశెట్టి చంటి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, మిద్దే ఆదినారాయణ, వాసంశెట్టి సత్యనారాయణ, యెలిశెట్టి ప్రభాకర్, చిక్కం హనుమంతు, పల్లికొండ సుధీర్, దేవపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ఆత్రేయపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ఆలయాలలో తలుపులను పగులగొట్టి బంగారం, వెండి వస్తువులను దొంగిలిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 9న ఆత్రేయపురం మండలం పేరవరం వేంకటేశ్వరస్వామి ఆలయం తలుపులను పెకిలించి స్వామివారి వెండి ఆభరణాలను దొంగలించారు. దీనిపై నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీస్ విచారణలో ఖమ్మంజిల్లా కమ్మరిగూడెంనకు చెందిన ఎస్. కాంతారావు, ఏలూరుజిల్లా వేలూరుపాడుకు చెందిన వేము ల వెంకటేష్‌లను అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. మరో వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.